# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-09-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతో ప్రజలకు సత్వర న్యాయం అందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.**

2. **ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈ రోజు కలిశారు.**

3. **దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడానికి జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనది రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

4. **విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి 11 రోజుల పాటు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.**

5. **కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో నివసించే గిరిజనకు దీపం-2 పథకం కింద ఇకపై 14.2 కిలోల గృహ ఎల్పీజి కనెక్షన్లు అందించనున్నట్లు పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

==========================

ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతో ప్రజలకు సత్వర న్యాయం అందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు న్యాయ వ్యవస్థపై అపారమైన నమ్మకం ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఈ రోజు జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కొన్ని కేసులు జాప్యం జరిరగినప్పటికీ, చాలా కేసులు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది పెద్దవాళ్లు మధ్యవర్తిత్వం చేసేవారని పేర్కొంటూ...

(వాయిస్... 35 సెకన్లు)

ఈ సదస్సులో పాల్గొన్నా రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. చాలా కేసులు మధ్యవర్తిత్వంతో పరిష్కారం అవుతాయని తెలిపారు. న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరమని పేర్కొన్నారు.

--------------------------

ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈ రోజు కలిశారు. రాష్ట్రానికి

సెమీ కండక్టర్ పరిశ్రమ కేటాయించడం పట్ల, అలాగే విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టినందుకు ప్రధాన మంత్రికి లోకేష్ కృతజ్ఞతలు చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై పూర్తి నివేదికను ప్రధానికి లోకేష్ అందించారు.

---------------------------

అంకిత భావంతో పని చేస్తూ భవిష్యత్ తరాలకు ఉపాధ్యాయులు మార్గదర్శులు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పిల్లల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తత్త్వవేత్త, రాజనీతిజ్ఞుడు, ఉపాధ్యాయుడు, భారత మాజీ ఉప రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతినే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.మెగా డియస్సి ద్వారా నూతనంగా ఎంపిక కాబడిన ఉపాధ్యాయులకు ఉపముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

అదేవిధంగా విజయవాడలో ఈ రోజు సాయంత్రం జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఈ వేడుకల్లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి అవార్డులు ప్రదానం చేయనున్నారు.

---------------------------

దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడానికి జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనది రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. జిఎస్టీ శ్లాబ్‌ల సరళీకరణ పర్యాటక, సినిమా రంగాల బలోపేతానికి దోహదం చేస్తుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో తక్కువ ధరల్లోనే వినోదం అందుబాటులో ఉంటుందన్నారు. 18 శాతం శ్లాబ్ లోకి సినిమా ప్రొడెక్షన్ సేవలను తీసుకురావడంతో నిర్మాతలకు ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. 7,500 లోపు అద్దె ఉన్న హోటల్ గదులపై జిఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గిందని, రెస్టారెంట్ బిల్లులపైన పన్నును 5 శాతానికి తగ్గించబడిందని వెల్లడించారు. జిఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు మంత్రి అభినందనలు తెలిపారు.

---------------------------

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి 11 రోజుల పాటు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. విజయవాడలో దసరా మహోత్సవాల నిర్వహణపై అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణలో సాంకేతికత వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ కీలకమని, తిరుమలలో యాత్రికుల రద్దీ నియంత్రణ అనుసరిస్తున్న విధానాన్ని ఇక్కడ పాటించాలని సూచించారు. మూలా నక్షత్రం రోజున దుర్గమ్మకు ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు అన్ని ఏర్పాట్లూ చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీలోపు ఎర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేస్తూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకోవడంతో పరిశ్రమల వర్గాల్లో హర్షం వ్యక్తమవుతుంది. 56వ వస్తుసేవల పన్ను (జీఎస్టీ) మండలి

సమావేశంలో, సామాన్యులు, రైతులు, మధ్యతరగతి, యువతకు నేరుగా ఆర్థిక ఊరట కలిగించేలా జీఎస్టీ శ్లాబ్‌లను సులభతరం చేసి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ అఫ్ కామర్స్ కార్యదర్శి రాజశేఖర్ ఈ రోజు ఆకాశవాణికి తెలిపారు. దేశంలో వ్యాపార రంగం ఇబ్బందుల్లో ఉన్న పరిస్థితుల్లో ఈ సంస్కరణల వల్ల ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతందని పేర్కొంటూ..

వాయిస్... 30 సెకన్లు

పేద, మధ్య తరగతి విద్యార్థులకు జీఎస్టీ సంస్కరణలు ఊరట కలిగించాయని విద్యా సంస్థల ప్రతినిధి సుమ ఈ రోజు ఆకాశవాణికి తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఈ సంస్కరణలు దోహదపడతాయని పేర్కొంటూ..

వాయిస్... 20 సెకన్లు

---------------------------

కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో నివసించే గిరిజనులకు దీపం-2 పథకం కింద ఇకపై 14.2 కిలోల గృహ ఎల్పీజి కనెక్షన్లు అందించనున్నట్లు పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో ఇప్పటి వరకు 5 కిలోల ఎల్పీజీ కనెక్షన్‌లను వినియోగిస్తున్న గిరిజనులు దీపం పథకం కింద పూర్తి స్థాయి ప్రయోజనం పొందలేకపోతున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వీరందిరికీ 14.2 కిలోల ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చేందుకు రాష్ట్రమంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయంతో 16 జిల్లాల్లో ఉన్న గిరిజన ప్రాంతాల్లోని దాదాపు 23,912 మంది అర్హులైన కుటుంబాలు లబ్ధిపొందుతాయన్నారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతం, దాని సరిహద్దు ఒడిశా తీర ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి లక్ష్మీ తెలియజేస్తూ...

వాయిస్..30 సెకన్లు

=====================